క్లుప్తంగా

తిరునామాలకు విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పా కోట శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని శంఖ, చక్ర, తిరునామాలకు, ఆలయ శిఖరాలకు పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. శంఖ, చక్ర, తిరునామలకు అభిషేకాలు చేసి, పూల అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు హారతులు ఇచ్చారు.



పూల అలంకరణ

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన చేజర్ల కొండారెడ్డి, ఇందిరమ్మ దంపతులు ఆదివారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు విరాళాన్ని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి శ్రీస్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కేవీబీపురం: మండలంలోని మేజర్‌పంచాయతీ పెరిందేశం దళితవాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వంద కుటుంబాలకు తాగునీటిని సరఫరా చేసే చెక్‌వాల్ మరమ్మతులకు గుర్తై 20 దాటుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తాగునీటికి పడే అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయని చెబుతున్నారు. సోమవారం లోగా సమస్యను పరిష్కరించకుంటే మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు.

నేడు మహానంది విగ్రహం ప్రారంభోత్సవం



వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరా లయంలోని రాజగోపురం ఎదుట నూతనంగా నిర్మించిన మహానంది విగ్రహాన్ని సోమవారం ఉదయం 9గంటలకు ప్రారంభించనున్నట్లు విగ్రహ దాత డాక్టర్ బొప్పన మోహనమురళీ తెలిపారు. శాస్త్రోక్తంగా చేపడుతున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి భక్తులు తరలి రావాలని కోరారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

రేణిగుంట: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమని మండల కోఆప్షన్ సభ్యుడు హసన్, రేణిగుంట సర్పంచ్ నగేషం అన్నారు. రేణిగుంట రైల్వే క్రీడా మైదానంలో ఆదివారం చిత్తూరు నెహ్రూ యువకేంద్రం, ఆషా సంస్థ సంయుక్తంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించాయి. బెస్ట్ ఆఫ్ త్రీగా జరిగిన ఈ మ్యాచ్‌లలో ఫైనల్స్‌లో ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్, మధు ఫ్రెండ్స్ జట్లు తలపడ్డాయి. ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్టు విజేతగా నిలిచి కప్పును కైవశం చేసుకుంది. జట్టుకు ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు, కోఆప్షన్ సభ్యుడు హసన్, సర్పంచ్ నగేషం షీల్డు అందజేశారు.

జెండా ఆవిష్కరణ

సత్యవేడు: పట్టణంలో ఆదివారం రాత్రి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ కుమార్ ఆపార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటగా సత్యవేడు నియోజవర్గంలో పర్యటిస్తున్నామన్నారు. డాక్టర్ గోపి, అంబేడ్కర్ సంఘం నాయకులు రాజ పాల్గొన్నారు.

రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో గోడ చిత్రాలే విజ్ఞాన వీచికలు



రేణిగుంట బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో సుందరంగా మార్బల్స్



రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల



భవితకు సౌధాలు..సర్కారు స్కూళ్లు

- నాడు–నేడుతో మారిన సర్కారు బడుల రూపురేఖలు
- నియోజకవర్గంలో 152 పాఠశాలల్లో రూ.28 కోట్లతో నాడు–నేడు పనులు
- ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- సర్వత్రా హర్షాతిరేకాలు

రేణిగుంట: నాడు చిన్నపాటి వర్షానికే ఉరిసే శిథిలావస్థకు చేరిన తరగతి గదుల్లో బిక్కుబిక్కుమంటూ సాగిన చదువులు.. బడి ప్రాంగణమంతా నిండిన రాళ్ల రప్పలు తగిలి జారి పడి గాయాల సహవాసం చేసిన విద్యార్థిలోకం.. ఇలా.. ఒకటే మిటి.. సమస్యల లోగిళ్ల మధ్య చిన్నారుల భవిష్యత్తును నిర్దేశించే పాఠశాలల దుస్థితి.. ఇదంతా గతం.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే నాడు–నేడు పథకం కింద సర్కారు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది.. కార్పొరేట్‌ను తలదన్నే హంగులతో సర్కారు బడులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. మొదటి విడతగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 152 పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద రూ. 28కోట్లకు పైగా ఖర్చు చేసి నూతన సొబగులు అద్దారు. విద్యారంగంలో ఒక నూతన ఒరవడి అని విద్యావేత్తలే హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో 510మంది విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం నాడు–నేడు పథకం కింద ప్రభుత్వం రూ.43లక్షల 40వేలు ఖర్చు చేసింది. దీంతో స్కూల్ రూపురేఖలు మారిపోయాయి. తరగతి గదుల్లో చలువ రాళ్లు పరచి సరికొత్తగా ముస్తాబు చేశారు. డిజిటల్ క్లాస్ రూములు తయారయ్యాయి. పాఠశాల గోడలు పాఠ్య సంబంధ చిత్రాలు, దృశ్య మాలికలతో విజ్ఞాన వీచికల్లా దర్శనమిస్తున్నాయి. ఒక్క రేణిగుంట బాలికోన్నత పాఠశాలే కాదు.. నియోజకవర్గంలోని 152 స్కూళ్లలో అత్యాధునిక వసతులు సమకూరాయి. తల్లిదండ్రులు, విద్యా వేత్తలు పాఠశాలలు రూపురేఖలు చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నాడు–నేడు పనుల వివరాలు

మండలం	నాడు–నేడు పాఠశాలలు	మొత్తంఖర్చు (రూ.లక్షల్లో)
శ్రీకాళహస్తి	61	1,174.24
రేణిగుంట	23	546.98
ఏర్పేడు	41	713.19
తొట్టంబేడు	27	396.19
మొత్తం	152	2,830.60



సుందరంగా శ్రీకాళహస్తి మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ పాఠశాల

సరికొత్త విప్లవానికి నాంది



నేను గతంలో ఎప్పుడూ ప్రభుత్వ పాఠశాలలను ఈ తరహాలో చూడలేదు.. నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతులు ఊహించని రీతిలో సమకూరాయి. ముఖ్యమంత్రి విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు. సర్కారు బడుల్లో చదివే పిల్లలంతా భావితరాల్లో దేశం గర్వించే పౌరులుగా తయారవుతారన్న విశ్వాసం కలిగింది.

– జూలియన్‌రాజు, రిటైర్డ్ బ్యాంకు అధికారి, రేణిగుంట

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



నాడు–నేడు పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. వసతులు ఎంతో మెరుగయ్యాయి. మొదటి విడతలో రేణిగుంట మండలంలో 23 పాఠశాలల్లో రూ.5కోట్ల 46లక్షలు ఖర్చు చేశాం. మారిన సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలో సౌకర్యాలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయలందరూ అర్హత, ప్రావీణ్యం విషయంలో నిష్ణాతులై ఉన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్చాలి.

– ఇందిరాదేవి, ఎంఈఓ, రేణిగుంట



సుబ్బానాయుడు కండ్రిగ పాఠశాల గోడలపై రాష్ట్రీయ చిహ్నాలు



తొట్టంబేడు మండలం చోడవరం పాఠశాల దుస్థితి.



సుందరంగా రూపుదిద్దుకున్న చోడవరం పాఠశాల



ఏర్పేడు ప్రాథమిక పాఠశాల తరగతి గదులు

ఆలయ ప్రతిష్టను దిగజార్చవద్దు



గంటలను చూపుతున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రతిష్టను దిగజార్చే విధంగా టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హితవు పలికారు. ఆలయ పరిపాలన భవనంలో ఆదివారం పాలక మండలి సభ్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సూక్ష్మనంది, బంగారు గంటలు మాయమైనట్లు శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. రాతి ధ్వజ స్తంభం వద్ద సూక్ష్మనందికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బంగారు తొడుగు చేయించారని వెల్లడించారు. అందులో భాగంగా పాత ఇత్తడి గంటలు తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాత వాటిని ఆలయ అలంకార మండపంలో భద్రపరిచామంటూ మీడియా ఎదుట ప్రదర్శించారు. ఇత్తడి గంటలను బంగారు గంటలు అంటూ అసత్య ప్రచారం చేయడం సుధీర్‌రెడ్డి అవివేకానికి నిదర్శనమన్నారు. తిరుమంజనం గోపురం విశిష్టత కాపాడుతూ మెట్లు ఏ మాత్రం అణవంతు కూడా దెబ్బతినకుండా వాటిపై సులభంగా ఎక్కేందుకు ఇనుప మెట్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కేవలం మహాశివరాత్రి పర్వదినాన ప్రత్యేక దర్శనాల కోసమే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శివంటు శివం రోడ్డు రూ.19లక్షలతో టెండరు పిలిచి పనులు చేపడుతున్నారని చెప్పారు. నాలుగు మాడ వీధుల్లో ఆధునిక లైటింగ్ విధానం తీసుకొచ్చే పనులు రూ.2 కోట్లతో చేపట్టామని, అయితే దేవదాయ శాఖ అనుమతుల వల్ల ఆలస్యం జరిగిందే తప్ప శివరాత్రి ముందు హడావుడి చేయడం లేదని స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా యుద్ధప్రతిపాదికన పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా సన్నిధివీధిలో డబుల్‌రోడ్డు వచ్చే విధంగా నూతనంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. సన్నిధివీధిలో తేరువీధి నుంచి వచ్చేలా కూడా రోడ్డు నిర్మాణం చేస్తున్నామని, వాహన మండపానికి అడ్డుగా లేకుండా గాంధీజీ విగ్రహాన్ని పక్కకు జరిపే ఏర్పాటు చేస్తున్నామే కానీ తొలగించలేదన్నారు. కేవలం స్వార్థ రాజకీయాల కోసం అసత్య ఆరోపణలు చేయడం బొజ్జల సుధీర్ రెడ్డికి తగదని హితవు పలికారు. గత 30 ఏళ్ల అధికారం చలాయించిన బొజ్జల కుటుంబం ఆలయ అభివృద్ధికి ఏమాత్రం పాటు పడలేదని గుర్తుచేశారు. కనీసం ఇప్పుడైనా మహాశివరాత్రి వేడుకలకు భూరి విరాళం అందించి భక్తిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, కొండూరు సునీత, రమాప్రభ, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, జూలుగంటి సుబ్బారావు పాల్గొన్నారు.

అక్కుపల్లి సుబ్బయ్య సేవలు చిరస్మరణీయం



అక్కుపల్లి సుబ్బయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



జ్యోతీరావ్‌పూలే, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: మండలంలోని వాగివేడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అక్కుపల్లి సుబ్బయ్యయాదవ్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. వాగివేడులో సుబ్బయ్య మనవడు అక్కుపల్లి మహేష్ యాదవ్ ఏర్పాటు చేసిన సుబ్బయ్యయాదవ్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. అదే విధంగా సచివాలయ ఆవరణలో డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపేడు ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి 1958లో సుబ్బయ్య రూ.2,116 విరాళంగా అందించారన్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో ఓ వ్యక్తి మరణిస్తే పదిరోజుల్లో మర్చిపోతున్నారని, అలాంటిది ఆయన మనవడు తాత విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా తాత పేరుపై ట్రస్టు ఏర్పాటు చేసి రూ.10లక్షలు పేద విద్యార్థుల చదువు కోసం వెచ్చించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, నాయకులు అక్కుపల్లి భానుమూర్తి, నాగోలు శ్రీనివాసులురెడ్డి, గున్నేరి కిషోర్ రెడ్డి, కూనాటి రమణయ్యయాదవ్, వాసుదేవరెడ్డి, వయ్యాల మనోహర్‌రెడ్డి, భూషణంయాదవ్, సురేంద్రయాదవ్, శంకర్‌యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుద్ధి చేసిన శివభక్తులు

నాగలాపురం: మండలంలోని సురుటపల్లిలో ప్రసిద్ధి గాంచిన శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తమిళనాడు అడయారుకు చెందిన శ్రీతాండుండీశ్వర తిరుకోయిల్ సంఘం సభ్యులు(60 మంది శివ భక్తులు) పరిశుభ్రత పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణం, పరివార దేవతా మూర్తుల ఆధార పీఠాలు, నవగ్రహ సన్నిధి, ప్రదోష మండపాన్ని పరిశుభ్రం చేశారు. ఏటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు శివభక్తులు ఆలయం మొత్తం శుద్ధి చేయడం ఆనవాయితీ అని దేవస్థానం చైర్మన్ బాలాజీ రెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయపడ్డారు. సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన రవి(37), సత్యరాజ్(25) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తున్నారు. ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ముందువెళుతున్న లారీని అధికమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ రాయితీపై హర్షం

వరదయ్యపాళెం: పవర్‌లూమ్స్ కార్మికులకు ప్రభుత్వం విద్యుత్ రాయితీ కల్పించడం అభినందనీయమని ఆల్ ఇండియా దేవాంగ మీడియా ఇన్‌చార్జ్ గుత్తి త్యాగరాజు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేతలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు విడతలుగా నేతన్న నేస్తం ఇచ్చి అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రస్తుతం పవర్ లూమ్స్‌కు రాయితీ కల్పించడం చారిత్రకమన్నారు.

శాస్త్రోక్తంగా దోపోత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఘనంగా దోపోత్సవం జరిగింది. మొదట స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అలంకారమండపంలో పలు రకాల అభిషేకపూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకున్న అనంతరం దోపోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహిళా కమిటీ నియామకం



ఎన్నికైన మహిళా కమిటీ

శ్రీకాళహస్తి: ముదిరాజ్ నియోజకవర్గ మహిళా విభాగం కార్యవర్గాన్ని సంఘం అధ్యక్షుడు వైవీ రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రకటించారు. నియోజకవర్గ అధ్యక్షురాలిగా కోనేటి నాగలక్ష్మి, యువత అధ్యక్షురాలిగా పిళ్లారి అమరావతి, పట్టణ అధ్యక్షురాలిగా ఆకుల సునీత, ప్రధాన కార్యదర్శిగా సుజాత, గౌరవాధ్యక్షురాలిగా బొజ్జ పద్మశ్రీ, ఉపాధ్యక్షురాలుగా శ్రీవిద్య, సంయుక్త కార్యదర్శులుగా అలేఖ్య, లత, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజేశ్వరి, అరుణ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మునెమ్మ, లలిత, నాగమణి, సుబ్బమ్మ, శ్యామల, స్వాతి, సురేఖ, వరలక్ష్మి, సుమలత తదితరులను ఎంపిక చేసినట్లు రమణయ్య వివరించారు.

గ్రామాల్లో కరాటే ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సత్యవేడు: మండలంలోని పల్లెల్లో కరాటే ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాస్టర్ జీఎం భునేశ్వర్ (4వ డాన్ బ్లాక్ బెల్టు) తెలిపారు. ఆదివారం కాళమనాయుడు పేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను సర్పంచ్ టి.జయ, సత్యవేడు వైద్యశాల హాస్పిటల్ కమిటీ సభ్యుడు ఈ.గోవిందస్వామి ప్రారంభించారు. కటా, జూడో తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కరాటే మాస్టర్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా సత్యవేడు మండలంలో గోజూరియో దూ కరాటే ఇండియా పేరుతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 200 మందికి పైగా శిక్షణ పొందారన్నారు. జూలైనెలలో చెన్నైలోని మైలాపూర్‌లో నిర్వహించనున్న ఇంటర్ నేషనల్ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొనున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు శిక్షకుడు టి.సూర్య(బ్లాక్ బెల్టు) శిక్షణ ప్రారంభించారు.